ప్రజాశక్తి
గురువారం 18 డిసెంబరు, 2025
5
శ్రీకాకుళం



2700 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు

జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథస్వామి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రబీ 2025-26కి సంబంధించిన మొక్కజొన్న, వరి, ఇతర పంటలకు అవసరమైన యూరియాను జిల్లాకు కేటాయించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి కోరాడ త్రినాథస్వామి తెలిపారు. పంట విస్తీర్ణాన్ని బట్టి మండలాల్లోని రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్కెలు), పిఎసిఎస్, డిసిఎంఎస్ కేంద్రాలు, ప్రైవేటు డీలర్ల ద్వారా రైతులకు యూరియాను సజావుగా సరఫరా చేస్తామని పేర్కొన్నారు. 1100 మెట్రిక్ టన్నులు యూరియా జిల్లాకు వచ్చిందన్నారు. పస్తుతం రీటైల్ కేంద్రాల్లో 2700 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.

సొమ్ము ఒకరిది... సోకు మరొకరిది

- కొంత సొమ్ము నేతలకు, అధికారులకు ముడుపులు
- సొంత అవసరాలకు సొమ్ముల వాడకంపై ఆరోపణలు
- లెక్కాపత్రం లేని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ డబ్బులు
- అడగలేని నిస్సహాయ స్థితిలో తోటి మిల్లర్లు

రైస్ మిల్లర్ల అసోసియేషన్ పెద్దల తీరు సొమ్ము ఒకడొది... సోకు ఒకడొది అన్న చందంగా ఉంది. మిల్లర్ల నుంచి భారీగా వసూలు చేస్తున్న సొమ్ములను తమ సొంత అవసరాలకు వాడుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు అమాత్యుల మెప్పు కోసం వాణిజ్య ప్రకటనలు, ఇతర అంశాలకు దుబారా చేస్తున్నట్లు తెలుస్తోంది. అసోసియేషన్ నాయకులకు అధికార పార్టీ అండ బలంగా ఉండటంతో ఎవరూ నోరు విప్పలేని పరిస్థితి నెలకొంది. సొమ్ములు ఏమవుతున్నాయో అడగలేని నిస్సహాయ స్థితిలో తోటి మిల్లర్లు ఉన్నట్టు తెలుస్తోంది. అసోసియేషన్ డబ్బులపై లెక్కలు అడిగితే ఏ మిల్లుపై ఎప్పుడు దాడి జరుగుతుందోనని అంతా భయపడుతున్న పరిస్థితి నెలకొంది.



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో సుమారు 270 రైస్ మిల్లులు ఉన్నాయి. వీరంతా జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌లో సభ్యులుగా ఉన్నారు. అసోషియేషన్‌కు రకరకాల ఖర్చులు ఉండటంతో సభ్యులుగా ఉన్న మిల్లర్ల నుంచి గతంలో మూడు శాతం వరకు డబ్బులు తీసుకునేవారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బాధ్యతలు చేపట్టిన కొత్త అసోసియేషన్‌లోని కొందరు పెద్దలు దానిని అమాంతంగా పది శాతానికి పెంచారు. రాజకీయ అండదండలు పుష్కలంగా ఉన్న మిల్లర్ల పెద్దకు జిల్లాకు చెందిన ముఖ్య ప్రజాప్రతినిధి సోదరుడు తోడవ్వడంతో వారి దందాకు అడ్డే లేకుండాపోయింది. వారి చెప్పిందే వేదంగా, వారు చేసిందే తీర్మానంగా నడుస్తోంది. అసోసియేషన్ పెద్దలు అడిగిన కమిషన్ డబ్బులు ఇవ్వకపోతే జిల్లాలో వ్యాపారం చేయలేమని భావించిన మిల్లర్లు వారు నిర్ణయించిన డబ్బులు ముట్టజెప్పినట్టు తెలిసింది. అసోసియేషన్‌కు అంత డబ్బులు ఇవ్వాల్సిన అవసరమేమిటని కొంత మంది మిల్లర్లు తిరగబడ్డారు. వ్యాపారం సక్రమంగా జరగక నష్టపోతే తమను ఆదుకోవడానికి అసోసియేషన్ డబ్బులు ఏమైనా ఇస్తుందా అని ఇచ్చేందుకు నిరాకరించారు.

ఆ సొమ్ములు ఏమవుతున్నాయో

రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌కు ఏడాదికి కోట్ల రూపాయాల ఆదాయం సమకూరుతున్నట్టు తెలిసింది. అసోసియేషన్ పెద్దలు ఇప్పుడు కలెక్షన్ చేస్తున్న సొమ్ములే సుమారు రూ.7 కోట్ల వరకు ఉంటుందని మిల్లర్లలో చర్చ నడుస్తోంది. దీంతో పాటు శ్రీకాకుళం నగరంలో రైస్‌మిల్లర్స్ అసోషియేషన్ భవనంలో మొదటి అంతస్తులో వస్త్ర దుకాణం, రెండో అంతస్తులో కళ్యాణ మండపం, తిలారు సమీపంలోని ఓ గొడౌన్ తదితర భవనాలకు అద్దె రూపంలో నెలకు రూ.25 లక్షల వరకు ఆదాయం వస్తున్నట్లు తెలుస్తోంది. అందులో బ్యాంకు రుణంతో శ్రీకాకుళంలో నిర్మించిన రైస్ మిల్లర్ల భవనానికి బ్యాంకు ఇన్‌స్టాల్‌మెంట్ కింద రూ.10 లక్షలు చెల్లిస్తున్నట్లు తెలిసింది. ఏవిధంగా చూసుకున్నా అందులో రూ.15 లక్షల వరకు మిగులుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు గతంలో చెల్లించకుండా ఉన్న మిల్లర్ల నుంచి మూడు శాతం కమిషన్ డబ్బులు, రైస్ మిల్లర్ల నూతన భవనానికి ఫండ్ రూపంలో ఎనిమిది శాతం కూడా ఇప్పుడు మిల్లర్ల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నట్టు మిల్లర్లు గగ్గోలు పెడుతున్నారు. ఈ డబ్బులు ఏమవుతున్నాయో, ఎందుకోసం ఖర్చు చేస్తున్నారో మిల్లరకూ తెలియని పరిస్థితి నెలకొంది.

కొంత ముడుపులకు... కొంత సొంత అవసరాలకు

అసోషియేషన్‌కు భారీగా సమకూరుతున్న డబ్బుల్లో కొంత సొమ్మును రాజకీయ నేతలకు, అధికారులకు ముట్టచెప్తున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వం రావాల్సిన బిల్లులు, బకాయిలు కోసం వారికి డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని అసోసియేషన్ పెద్దలు చెబుతున్నట్లు తెలిసింది. పౌర సరఫరాల శాఖ వ్యవహారాలు చూసే ప్రభుత్వ పెద్దలకు, జిల్లాకు చెందిన ఓ ముఖ్య ప్రజా ప్రతినిధికి ఇలా ఎవరి వాటాలు వారికి ఇస్తునట్టు సమాచారం. దీంతో పౌర సరఫరాల సంస్థలో జిల్లా నుంచి పై వరకు బాధ్యతలు చూస్తున్న అధికారులకూ మూటలు అందిస్తున్నట్టు తెలుస్తోంది. అసోసియేషన్‌కు వస్తున్న ఆదాయంలో దేనికి ఎంత ఖర్చు చేస్తున్నారో కూడా మిల్లర్ల పెద్దలు ఎవరికీ లెక్కలు చెప్పకుండా గోప్యత పాటిస్తున్నట్టు తెలుస్తోంది. అసోసియేషన్ డబ్బులు పక్కదారి పడుతున్నా, తమ డబ్బులు అన్యాయంగా సొంత అవసరాలకు వాడుకుంటున్నారని తెలిసినా మిల్లర్లు ఏమీ అడగలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోతున్నారు.

అసోసియేషన్ పదవిపై వ్యామోహం ఆదాయం కోసమేనా?

జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌కు దండిగా ఆదాయం వస్తుండటంతో పాత కార్యవర్గాన్ని ఎప్పుడు దించుదామా? అని ప్రస్తుత పెద్దలు కాచుకుని కూర్చొన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వారితో బలవంతంగా రాజీనామ చేయించారు. అసోసియేషన్‌లో కీలక పదవులను తీసుకుని మొత్తం రైస్ మిల్లర్ల వ్యవస్థను తమ గుప్పిట్లోకి తీసుకుని తోటి మిల్లర్లతోనే ఆట ఆడుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



విద్యార్థినితో మాట్లాడుతున్న శైలజ

కెజిబివి విద్యార్థినికి న్యాయం చేస్తాం

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ

ప్రజాశక్తి- పొందూరు

సుమారు 3నెలల క్రితం లోలుగు కెజిబివి భవనం పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థినికి ప్రభుత్వపరంగా న్యాయం చేస్తామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. పొందూరు మండలంలోని లోలుగు కాలనీలో నివాసం ఉంటున్న కెజిబివి ద్వితీయ సంవత్సరం చదువుతున్న బాధిత విద్యార్థినిని బుధవారం ఆమె కలిశారు. ఈ సందర్భంగా పాఠశాలలో తనను కులం పేరుతో దూషించడంతో పాటు తల్లిని అవమానకరంగా మాట్లాడడంతో తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు విద్యార్థిని తెలిపిందని అన్నారు. ఆస్పత్రిలోని సమయంలో తనపై ప్రిన్సిపాల్, ఎపిసి ఒత్తిడి తీసుకురావడంతో తాను భవనంపై నుంచి ప్రమాదావశత్తు పడిపోయినట్లుగా పోలీసులకు స్టేట్‌మెంట్ ఇచ్చినట్టు తెలిపినట్లు పేర్కొన్నారు. తనను అన్నివిధాల ఆదుకుంటామని, సహకారాన్ని అందిస్తామని చెప్పి ఇప్పుడు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని విద్యార్థిని, తల్లి చైర్‌పర్సన్ వద్ద వాపోయారు. దీనిపై పలుమార్లు తనకు మెయిల్స్ రావడంతో విచారించేందుకు వచ్చామని ఆమె తెలిపారు. మూడు నెలలుగా విద్యార్థిని నడవలేని పరిస్థితి తలెత్తి మంచం పట్టిందని తమను ఆర్థికంగా ఆదుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని విద్యార్థిని తల్లి చైర్‌పర్సన్‌ను వేడుకున్నారు. దీనిపై ఇప్పటికే కేసు నమోదు చేశామని, విచారణ ఎంతవరకూ వచ్చిందనే విషయంపై సమాచారం తెలుసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. ఈమెతో పాటు జిల్లా బాలల సంరక్షణ అధికారి రమణ, ఎస్ఐ వి.సత్యనారాయణ, సిడిపిఒ సత్యశ్రీ సూపర్‌వైజర్ సుజాత ఉన్నారు.

పౌర సరఫరాల సంస్థ మేనేజర్‌పై విచారణ

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ వేణుగోపాల్‌పై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. మిలర్ల అసోసియేషన్ పెద్దల ఒత్తిడితో ధాన్యం కేటాయింపుల్లో అవకతవకలకు పాల్పడ్డారంటూ 'ప్రజాశక్తి'లో ఈ నెల 17న 'కప్పం కట్టాల్సిందే' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథానికి రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ కమిషనర్ స్పందించారు. దీనిపై విచారణకు ఆదేశించారు. జిల్లా కార్యాలయంలో గురువారం ఉదయం 10.30 గంటలకు ఇందుకు సంబంధించి ఏర్పాటు చేసిన కమిటీ విచారణ చేపట్టనున్నట్టు తెలిసింది.



రైస్‌మిల్లు యజమానితో మాట్లాడుతున్న జెసి

జెసి విస్తృత తనిఖీ


ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. మండలంలోని ఒప్పంగి, వాకలవలస గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ఒప్పంగిలోని సీతారామ మోడరన్ రైస్ మిల్లుతో పాటు వాకలవలసలోని లలిత ట్రేడర్స్ ధాన్యం మిల్లులను సందర్శించారు. అక్కడ నిల్వ ఉన్న ధాన్యం స్టాక్ పాయింట్లు, రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం రామచంద్రపురం, ఒప్పంగి గ్రామాల్లోని ప్రైవేట్ వే బ్రిడ్జిలను కూడా తనిఖీ చేశారు. తూకాల్లో తేడాలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కొనుగోలు ప్రక్రియలో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి కోరాడ త్రినాథస్వామి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం సదస్సులో కలెక్టర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం కలెక్టర్ల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాల్గొన్నారు. ఈ సదస్సులో ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా పాలనను మెరుగుపరచడంపై అందించిన దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు జిల్లాలో క్షేత్రస్థాయి మార్పులకు కలెక్టర్ శ్రీకారం చుట్టనున్నారు. ముఖ్యంగా డేటా ఆధారిత పాలన, ప్రభుత్వ సేవల్లో జవాబుదారీతనం, ప్రతి ఫైల్‌ను ఆన్‌లైన్ ద్వారా నిర్ణీత సమయంలో పరిష్కరించడం వంటి అంశాలపై సిఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. రెవెన్యూశాఖలో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం, కేంద్ర ప్రాయోజిత పథకాల సమర్థవంతమైన అమలు, జిల్లా అభివృద్ధిలో స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం వంటి అంశాలపై జిల్లా యంత్రాంగం మరింత ప్రత్యేక దృష్టి సారించనుందని అన్నారు. వరుసగా రెండో రోజు గురువారం కూడా జరిగే సదస్సుకు కలెక్టర్ హాజరవుతారు.



సదస్సులో పాల్గొన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్

సభ్యులకు తెలియకుండా డ్వాక్రా రుణాలు

- నౌపడ ఎస్‌బిఐలో ఇష్టారాజ్యం
- వడ్డీ వసులుపై సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

నౌపడ స్టేట్ బ్యాంకులో స్వయంశక్తి సంఘ సభ్యులకు తెలియకుండా వారి ఖాతాల్లో రుణం జమ చేసి ప్రతినెలా వడ్డీ వసూలు చేసిన ఘటన కలకలకం రేపింది. మదర్ థెరిసా స్వయంశక్తి సంఘం ఇప్పటికే రూ.10 లక్షల రుణం తీసుకుని వాయిదాలు చెల్లిస్తుండగా, ఈ ఏడాది సెప్టెంబరు 30న సభ్యులకు సమాచారం ఇవ్వకుండా పాత అప్పు జమ చేశారు. మిగిలిన రూ.7.20 లక్షలను అకౌంట్‌లో జమ చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. మూడు నెలలుగా సమాచారం లేకుండా తాజాగా రూ.16 వేలు వడ్డీ కట్ కావడంతో సభ్యులు బ్యాంకు అధికారులను ప్రశ్నించారు. తాము రుణం తీసుకోకపోయినా వడ్డీ ఎలా వసూలు చేస్తారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే తరహాలో మరో రెండు గ్రూపులకు కూడా జరిగిందన్న ప్రచారం నడుస్తోంది. గతంలో ఎక్కడ వలసలకు పోయినా బ్యాంకుకు రప్పించి మరీ రెన్యువల్ చేసే అధికారులు ఇప్పుడు అదేదీ పట్టించుకోకుండా రెన్యువల్ చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. కనీసం తీర్మానాలను కూడా పరిగణలోకి తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయం బయటకు రావడంతో బ్యాంకు అధికారులు, వెలుగు సిబ్బంది గ్రూపు సభ్యులను బ్యాంకుకు పిలిపించారని స్థానికంగా చర్చ సాగుతోంది.

వంద రోజుల పని తప్పనిసరి

డ్వామా పీడీ లవరాజు

ప్రజాశక్తి- కవిటి

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకం కింద తప్పనిసరిగా వంద రోజుల పని దినాలు కల్పించాలని డ్వామా పీడీ భావన లవరాజు స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో బుధవారం ఉదయం ఇచ్ఛాపురం క్లస్టర్ పరిధిలోని ఏడు మండలాల ఉపాధి హామీ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్ఆర్ఇజిఎస్‌లో భాగంగా ప్రతి రైతు తమ తోటల్లో నీటి గుంతలు తవ్వుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. అటువంటి రైతుల వివరాలను సేకరించి పథకం అమలుకు ముందడుగు వేయాలని తెలిపారు. రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కొత్త పనులను గుర్తించి యుక్తదార పోర్టల్‌లో వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అలాగే 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఉద్యానవన తోటలకు సంబంధించిన పనులను ఇప్పటినుంచే గుర్తించాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఎపిడి శ్రీనివాసరెడ్డి, ఎంపిడిఒ ఎల్.త్రినాథ్, ఎపిఒ మోహనరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ లవరాజు

మత్తు పదార్థాల రహిత సమాజమే ధ్యేయం

రాష్ట్ర పియుసి చైర్మన్, ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మత్తు పదార్థాల రహిత సమాజమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పియుసి చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పట్టణ శివారున ఉన్న ఫ్లైఓవర్ దగ్గర నుంచి కృష్ణాపురం వరకు మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో కలిసి బుధవారం అభ్యుదయం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైల్వే స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 18 నెలల కాలంలో ఆరు లక్షల టన్నుల గంజాయిని సీజ్ చేసి నాశనం చేశామన్నారు. 4581 కేసులను నమోదు చేసిందని, ఇదే సిఎం చంద్రబాబు నాయుడు పనితనానికి నిదర్శనమని అన్నారు. ఆమదాలవలస పట్టణంలోనూ పోలీస్‌శాఖను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో గంజాయి అమ్మినా, కొన్నా, తాగినా కూటమి ప్రభుత్వంలో చట్టం తన పని తాను చేసుకు పోతుందని హెచ్చరించారు. మత్తు పదార్థాలు వల్ల జీవితాన్ని నాశనం చేస్తున్నాయని, దీని ఆవశ్యకతను విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు స్వచ్ఛంద సంస్థలు ఇలా ప్రతిఒక్కరూ గుర్తెరగాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు మొదలవలస రమేష్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, టిడిపి నాయకులు నూక రాజు, సంపతరావు మురళి, నాగళ్ల మురళీధర్ యాదవ్, సిఐ పి.సత్యనారాయణ ఎస్ఐలు పాల్గొన్నారు.



సైకిల్ తొక్కుతున్న ఎమ్మెల్యే రవికుమార్

'గుడ్, బ్యాడ్ టచ్'పై అవగాహన



మాట్లాడుతున్న హరిబాబు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

తోటి బంధువులతో గాని, స్నేహితులతో గాని, ప్రయాణాల్లో గాని ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా, శరీర భాగాలపై చేతులు వేసినా అది నేరమని, అటువంటి సమయంలో వెనుకాడకుండా వెంటనే 'వద్దు' అని గట్టిగా చెప్పాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు విద్యార్థులకు సూచించారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచనలతో స్థానిక పిఎస్ఎన్ఎం హైస్కూల్‌లో 'బాలల స్నేహపూర్వక న్యాయ సేవలు' అంశంపై బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలలపై అకృత్యాలకు చట్టంలో కఠిన శిక్షలు ఉన్నాయని హెచ్చరించారు. ఆపదలో ఉన్నప్పుడు 1098, 100, 15100 నంబర్లను ఆశ్రయించాలన్నారు. క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో అడ్వకేట్ జి.ఇందిరాప్రసాద్, ప్రిన్సిపాల్ సిహెచ్.దేవదత్తానంద్, లెక్చరర్ కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎయు సందర్శన

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీను బుధవారం పరిశీలించారు. ఎన్‌టిఆర్ ప్రధాన పరిపాలన భవనంను, సైన్స్ కళాశాలలను పరిశీలించారు. నూతన పరిపాలనా భవనంలోని సమావేశ మందిరాలు, ఇతర కార్యాలయాలు, వసతులు, సౌకర్యాలు చూసి ఈ భవనం రాజమందిరాన్ని తలపిస్తుందని ఈ సందర్భంగా ప్రశంసించారు. వర్సిటీలోని ఖాళీ ప్రదేశంలో హంపీ థియేటర్‌ను నిర్మించినట్లయితే కేంపస్ మరింత శోభాయానమానంగా ఉంటుందని సూచించారు. వర్సిటీలో మరింతగా ఔషద మొక్కలను పెంచాలన్నారు. తద్వార పర్యావరణ సమతుల్యత ఉంటుందన్నారు. బిఆర్ఎయు మరింతగా పురోగతి సాధించాలని తన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. వర్సిటీని సందర్శించిన సందర్భంగా ఆచార్య కె.మధుమూర్తిని వైస్-ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని శాలువతో సత్కరించారు. వర్సిటీ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.స్వప్నవాహిని, ఎస్ఒ డాక్టర్ కె.సామ్రాజ్యలక్ష్మి, డాక్టర్ ఎన్.సంతోష్ రంగనాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధుమూర్తి

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 16 అదనపు ప్రత్యేక రైళ్లు నడవనున్నట్టు కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. జనవరి 9 నుంచి 19 మధ్య ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్ల కేటాయింపు విషయంలో ఇది వరకే అనేక దఫాలు ఉన్నతాధికారులకు స్పష్టమైన సూచనలు చేసినట్టు గుర్తు చేశారు. తాజాగా నవంబరు 4న విశాఖపట్నంలో నిర్వహించిన డివిజన్ కమిటీ సమావేశంలో కూడా మరోసారి సమీక్ష చేసినట్టు తెలిపారు. డివిజన్‌లో జరిగే అభివృద్ధి పనులతో పాటు పండగ ప్రత్యేక సమయంలో ప్రత్యేక రైళ్ల గురించి ప్రముఖంగా చర్చించినట్టు గుర్తు చేశారు. శ్రీకాకుళం రోడ్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ల మధ్య 07288, 07289, 07290, 07291, 07294, 07295, 07292, 07293 నంబర్లతో రైళ్లు జనవరి 9 నుంచి నడవనున్నాయని, ముందస్తు రిజర్వేషన్ చేసుకుని, సుఖవంతమైన ప్రయాణాలకు సాగించాలని స్పష్టం చేశారు.



మిల్లు యజమానితో మాట్లాడుతున్న తహశీల్దార్ పద్మావతి

ధాన్యం డబ్బులు జమ చేయాలి

ప్రజాశక్తి- బూర్జ

రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులను మిల్లర్లు రైతులు ఖాతాలోకి తక్షణమే జమ చేయాలని తహశీల్దార్ వై.వి పద్మావతి మిల్లర్ల యాజమాన్యానికి ఆదేశించారు. బుధవారం మండలంలోని డొంకల పర్తలోని శ్రీఅయ్యప్ప రైస్‌మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతుల నుంచి ప్రతి ధాన్యం బస్తా నుంచి అదనంగా 6 కేజీలు చొప్పున తీసుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయన్నారు. రైతుల నుంచి అదనంగా తీసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే దళారుల ప్రమేయం లేకుండా రైతుల నుంచి నేరుగా ధాన్యాన్ని కొనుగోలు చేసి వారికి సక్రమంగా నగదును అందజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. రైతుల నుంచి ఆరోపణలు వస్తే సహించమని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అందుకోసం మిల్లు వద్ద వీఆర్ఒను ఉంచడం జరుగుతుందన్నారు. అనంతరం రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈమె వెంట ఆర్ఐ స్వీల్లా, వీఆర్ఒ శ్రీనివాసరావు ఉన్నారు.



ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

'ఉపాధి హామీ' పేరు మార్చడం సరికాదు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఉపాధి హామీ పేరు మారిస్తే సహించబోమని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బమ్మిడి ఆనందరావు కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. కొత్తగా తెచ్చిన బిల్లు ప్రతులను వజ్రపుకొత్తూరులో బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ ద్వారా వంద రోజులు పని కల్పించే చట్టాన్ని బిజెపి పాలకులు మార్చే ప్రయత్నాలు విరమించుకోవాలన్నారు. బిల్లులో ఉన్న ఖాళీలను, 125 రోజులు పని దినాలు కల్పిస్తున్నట్లు చెప్పిన దానికి పొంతన లేదన్నారు. ఇవి ప్రజలను మోసగించే చర్యలు, వీటిని ఉపసంహరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్.చంద్రయ్య, ఎస్.ఈశ్వరమ్మ, బి.సూరిబాబు, రైతు సంఘం నాయకులు బి.రామకృష్ణ, ఎస్.మల్లేసు, డి.చలపతిరావు, మోహనరావు, విగ్నేష్, బి.పోలీస్, బి.లక్ష్మి, ఎస్.లక్ష్మి పాల్గొన్నారు.



ఎంపిడిఒకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కాలనీవాసులు

మౌలిక వసతులు కల్పించాలని వినతి

ప్రజాశక్తి- పొందూరు

స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని పైడితల్లి అమ్మవారి కాలనీ (జగనన్న కాలనీ)లో మౌలిక వసతులను కల్పించాలని కోరుతూ కాలనీవాసులు బుధవారం ఎంపిడిఒ ఎన్.వాసుదేవరావు, తహశీల్దార్ ఆర్.వెంకటేష్, ఇఒ పి.జగదీష్‌లకు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం కాలనీలో 50 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి అధ్వాన్నంగా ఉందని, వర్షాకాలం వచ్చిందంటే రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. అలాగే కాలనీవాసులు ఎవరైనా మరణిస్తే వారికి దహన సంస్కారాలు నిర్వహించేందుకు అవసరమైన స్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరారు. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులకు, సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా సమస్యలు పరిష్కారం కాకుండా అలాగే ఉండిపోయాయని, అధికారులు స్పందించి తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుకున్నారు.



శిక్షణ పొందిన విద్యార్థులతో అధ్యాపకులు

నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

వజ్రపుకొత్తూరు: విద్యార్థులు జీవన సాఫల్య నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సాయి వినీత్ విద్యా సంస్థల ప్రిన్సిపల్ అన్నెపు కైలాసరావు అన్నారు. సాయి వినీత్ డిగ్రీ కళాశాలలో చివరి ఏడాది చదువుతున్న డిగ్రీ విద్యార్థులకు రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా మేజిక్ బస్ సంస్థ ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన లైఫ్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్‌పై నిర్వహించిన శిక్షణ ముగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమం విద్యార్థులకు మరువలేని అనుభవంగా నిలుస్తుందన్నారు. శిక్షణ కాలంలో విద్యార్థులకు సంస్థ ట్రైనర్ దుంపల వెంకటేష్ విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ సన్నద్ధత, ఎడ్యుకేషనల్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్, సాఫ్ట్ మేనేజ్‌మెంట్ స్కిల్స్, డిజిటల్ మీడియా ప్లాట్‌ఫాంలో సేఫ్ బిహేవియర్, నాయకత్వ లక్షణాలు మొదలైన వాటిపై శిక్షణ ఇచ్చారు. నాన్-వెర్బల్ కమ్యూనికేషన్, కస్టమర్ డీలింగ్ సెల్ఫ్ పిచ్, వర్క్‌ప్లేస్ ఎటికెట్స్, సమాజంలో సామాజిక విలువల ప్రాధాన్యత, వర్క్‌ప్లేస్‌లో ప్రొఫెషనల్ స్కిల్స్, సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేధా వంటి విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ఇప్పిలి ప్రవీణ్, ఇంటర్న్‌షిప్ అధికారి రొక్కం నరేంద్ర, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకాష్ పరామర్శ



పరామర్శిస్తున్న ప్రకాష్

కవిటి: ఇటీవల మృతి చెందిన పలువురు కుటుంబాలను ఎంపిపి ప్రతినిధి, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్ బుధవారం పరామర్శించారు. చంపిపుట్టుగకు చెందిన ఎర్ని బాలకృష్ణ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. బాలకృష్ణ కుమార్తెలు, తమ్ముడు కొడుకు ఎర్ని ఆశోక్‌ను పరామర్శించి ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆదేవిధంగా వైసిపి సీనియర్ నాయకులు నర్తు నరేంద్ర యాదవ్ మంగళవారం బాలకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు యలమంచి నీలయ్య, కృష్ణ రౌళో, పిరియా వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ భిక్ష కాదు.. విశ్రాంత ఉద్యోగుల హక్కు



శ్రీకాకుళం సిటీ : పెన్షనర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- అరసవల్లి

పెన్షన్ ప్రభుత్వాలు ఇస్తున్న దయాభిక్ష కాదని జీవిత కాలం ప్రభుత్వానికి అందిం, బాధ్యతగా పనిచేసిన విశ్రాంత ఉద్యోగుల హక్కు అని పెన్షనర్ల దొంతం పార్వతీశం, ఆదినారాయణ అన్నారు. బుధవారం పెన్షనర్స్ డే సందర్భంగా ఇలిసిపురంలో ఉన్న యుటిఎఫ్ భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పెన్షనర్లపై కేంద్ర ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకునే ప్రయత్నం చేస్తుందని, ఇది సరికాదన్నారు. 1982లో జస్టిస్ చంద్ర చూడ్ వెలువరించిన తీర్పులో పెన్షన్ దయాభిక్ష కాదు, ఉద్యోగుల హక్కు అన్నారు. రాజ్యాంగం ఆర్టికల్ 41లో జీవిత చరమాంకంలో ఉన్న వారికి అవసరమైన సహాయం అందించడం రాజ్యాంగం బాధ్యతని చెప్పబడిందని, ప్రభుత్వ వైఖరి ఇందుకు భిన్నంగా ఉండడం శోచనీయమన్నారు. సాంకేతిక అభివృద్ధి తదితర కారణాల వలన శాశ్వత ఉద్యోగుల సంఖ్య క్రమంగా తగ్గుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగులు, పెన్షనర్లపై ఆర్థికభారం కూడా ప్రభుత్వానికి క్రమంగా తగ్గుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో పాత పెన్షన్ విధానం భారం ఎలా అవుతుందని ప్రశ్నించారు. జనవరి 2026 ముందు తర్వాత రిటైర్డ్ అయిన పెన్షనర్ల మధ్య వ్యత్యాసం చూపే ఆలోచన విడనాడాలన్నారు. కార్యక్రమంలో వివిధ కేంద్ర, రాష్ట్ర, ప్రైవేట్ సంస్థలకు చెందిన విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమానికి కోశాధికారి పి.సుధాకర రావు (బ్యాంకు), సిపిఎస్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు జి.భాస్కరరావు, కె.శ్రీనివాసు (ఎల్ఐసి), బి.లక్ష్మణరావు (ఆర్‌టిసి), వి.శ్రీనివాసరావు (పీర్లేస్), పి.నరసింహమూర్తి (ఎడ్యుకేషన్) నాయకత్వం వహించారు. అనంతరం డాక్టర్ బగాది శ్రావ్య (ఎండి) సీనియర్ సిటిజెన్ల ఆరోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్గించారు. సభ్యుల సందేహాలకు సమాధానం చెప్పారు.

స్థానిక సూర్యమహల్ జంక్షన్ టెలికం కార్యాలయం ఎదుట పెన్షనర్స్ నిరసన వ్యక్తం చేశారు. స్కీమ్ విధానాల్లో పెన్షన్ నిధులు షేర్ మార్కెట్లో పెట్టుబడి పెడతారని, ఫలితంగా రాబడికి గ్యారెంటీ ఉండదని, తదనుగుణంగా చెల్లించే పెన్షన్‌కు భద్రత ఉండదన్నారు. అందరికీ పాత పెన్షన్ విధానం అంటే ఒపిఎస్ విధానాన్ని ప్రభుత్వం సానుకూలంగా అంగీకరించి తమ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ రైల్వే, టెలికం, ఎల్ఐసి తదితర కేంద్ర ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్ సంస్థలకు చెందిన విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డి.వెంకటేశ్వరరావు, ఎం. గోవర్ధనరావు, కె.చంద్రశేఖర్, టెలికం విశ్రాంత ఆఫీసర్ మత్తి రమేష్, రామారావు, బి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. స్థానిక పశుసంవర్ధక శాఖ సమావేశ మందిరంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్సనర్లుకు సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి, ఎన్‌జిఒ సంఘం నాయకులు చౌదిరి పురుషోత్తం నాయుడు, జిల్లా ఎపి ఎన్‌జిఒ సంఘం నాయకులు హనుమంతు సాయిరాం పాల్గొన్నారు.

రణస్థలం: రిటైర్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రం జె.ఆర్‌పురం ట్వింకిల్ స్కూల్ ఆవరణంలో నిర్వహించిన జాతీయ ఫెన్షన్‌దారుల దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ ఎదురుకుంటున్న సమస్యలను ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలని అధ్యక్ష, కార్యదర్శి పిన్నింటి సూర్యనారాయణ, మాడుగుల రామారావు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగులు, కూటమి నాయకులు డిజిఎం ఆనందరావు, పిన్నింటి భానోజీనాయుడు, పిషిణి జగన్నాథం నాయుడు పాల్గొన్నారు.

ఆమదాలవలస: 12వ పిఆర్‌సిని వెంటనే నియమించి 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సంఘ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్ధనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షనర్స్ డే సందర్భంగా పట్టణంలోని వన్వే జంక్షన్ వద్దనున్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. ప్రధాన రహదారి గుండా పాతిని వారి వీధిలో ఉన్న ఉప ఖజానా కార్యాలయం వరకు పెన్షనర్లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు సురవరపు సిమ్మినాయుడు, గౌరవ అధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు, కోశాధికారి హెచ్‌వి సత్యనారాయణ, ఉప ఖజానా అధికారి బట్న కృష్ణారావు, పూర్వ ఉప ఖజానా అధికారి సువర్ణ రాజు, ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ సుశాంత్ కుమార్, సంఘ నాయకులు డి.లక్ష్మణరావు, ఎన్.చంద్రశేఖర రావు, ఆర్.సత్యనారాయణ, కె. షణ్ముఖరావు, బి.సూర్యనారాయణ, పివిఎన్ మాస్టారు, పి.భానోజీరావు పాల్గొన్నారు.

పొందూరు: విశ్రాంత ఉద్యోగుల, కుటుంబ ఫెన్షన్‌దారుల సంక్షేమానికి కృషి చేయనున్నట్లు జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి అంకం ధర్మారావు అన్నారు. స్థానిక పట్టుశాలి కళ్యాణ మండపంలో జాతీయ ఫెన్షన్‌దారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డి.ఎస్.నకరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అలాగే విశ్రాంతి ఉద్యోగుల సంఘానికి స్థానిక యుబిఐ మేనేజర్ గేదెల బలరాం బీరువాను వితరణగా అందజేశారు. అనతంతరం 12 మంది సీనియర్ విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగల సంఘం అధ్యక్షుడు నాళం పైడిరాజు, ప్రధాన కార్యదర్శి పి.ఎస్.ప్రకాశరావు, ఎస్‌బిఐ మేనేజర్ పిహెచ్ ప్రసాదరావు, ఎపిజిఎస్ మేనేజర్ పి.భరణికుమార్, ఎస్‌టిఒ ఎం.తులసీరావు తదితరులు పాల్గొన్నారు.



అరసవల్లి : ధర్నా చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు



అరసవల్లి : సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్

ఇచ్ఛాపురం : ప్రభుత్వ విప్ అశోక్ సహకారంతో పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని రెడ్డిక వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్ రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించుకున్నారు. పెన్షనర్లు ఉచిత భవనం కోసం స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పెన్సనర్ల సంఘం ప్రతినిధులు కొంతాల మోహన్ రెడ్డి, బాగా మోహనరావు, బి.జయపతి, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎ.జయలక్ష్మి, ఎస్‌టిఒ ఎల్. రామారావు, సిహెచ్.అప్పారావు, రాజ్యలక్ష్మి, రఘునాథ్‌గౌడ్, కె.బాలరాజు, బి.ఢిల్లీరావు, ఎ.ఆనందరావు పాల్గొన్నారు.

టెక్కలి : జాతీయ పెన్షనర్స్ దినోత్సవం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహించారు. ఈ మేరకు వై.వి.చంద్రదూడ్ నకారా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ముందుగా స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మట్ట లక్ష్మీనారాయణ, గౌరవాధ్యఓఉలు జి.వి.రెడ్డి మాస్టారు, ధనుంజయరావు, బొడ్డ అయ్యబాబు, డి.ఎ.స్టాలిన్, దల్లి వీరాస్వామిరెడ్డి, ఆనిశెట్టి చిట్టెన్న, కుప్పిలి కామేశ్వరరావు, నాగభూషణం, ప్రదాన హరిశ్చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ప్రస్తుత సమాజంలో యువతను, సామాన్యులను పీడిస్తున్న డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ గేమ్స్ వంటి సైబర్ నేరాలపై ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆర్‌జియుకెటి (ట్రిపుల్ ఐటి) డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి. బాలాజీ పిలుపునిచ్చారు. బుధవారం ఎచ్చెర్ల, ఎస్.ఎం పురం, ఎస్.ఎస్.ఆర్.పురం, కేశవరావు పేట, బురిడి కంచరాం గ్రామాల్లో ట్రిపుల్ ఐటి జాతీయ సేవా పథకం యూనిట్లు 1, 2, 3, 5, 6 ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, బాల్యంలో క్రీడల ఆవశ్యకతను వివరిస్తూ సామాజిక సమస్యలపై చైతన్య ర్యాలీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎఒ డా. ముని రామకృష్ణ, డీన్ డా. శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డా. వాసు, వెల్ఫేర్ డీన్ డా. రవి, క్యాంపస్-2 ఇన్‌ఛార్జి సాగర్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా.పెద్దింటి ముకుందరావు, ఆయా యూనిట్ల ప్రోగ్రాం ఆఫీసర్లు, వలంటీర్లు పాల్గొని డిజిటల్ లిటరసీ, గ్రామ వికాసంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఎమ్మెల్యే పరామర్శ

రణస్థలం: రణస్థలం మండల సాక్షి రిపోర్టర్ గంగి నాగరాజు తండ్రి, జె.ఆర్.పురం భజన మండలి గురువు, రిటైర్డ్ ఆర్‌టిసి డ్రైవర్ గంగి గోపి ఇటీవల మరణించారు. ఎచ్చెర్ల శాసన సభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు బుధవారం ఆయన స్వగృహంలో గోపి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు నాయకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై అవగాహన

టెక్కలి రూరల్: మాదకద్రవ్యాలు విద్యార్థులకు దూరంగా ఉండాలని, లేదంటే విద్యార్థుల జీవితాలు నాశనమవుతాయని టెక్కలి సిఐ అంబటి విజయకుమార్ అన్నారు. ఎస్‌వి‌ఆర్ జూనియర్ కళాశాలలో బుధవారం మాదకద్రవ్యాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ర్యాంగింగ్‌కు పాల్పడితే చట్టాలు కఠినంగా ఉన్నాయన్నారు. ప్రతిఒక్కరూ సోదరి భావంతో నడవడిక ఉండాలన్నారు. ముందుగా ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం సిఐకి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్య క్రమంలో కళాశాల కరస్పాండెంట్ అన్నెపు ఉమా మహేశ్వం్రావు, ప్రిన్సిపాల్ మోహన్, ఎఒ రమేష్, డైరెక్టర్ శ్రీనివాస్, చింతాడ శ్రీనివాస్, అరుణ విద్యాలయ డైరెక్టర్ ఆనందరావు, ఎబివిపి నాయకులు మదన్, మురళి పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి- టెక్కలి

సరుబుజ్జిలి మండలం కొండవలసకు చెందిన దళిత విద్యార్థిపై అదే గ్రామానికి చెందిన అగ్రకులానికి చెందిన ఆటోడ్రైవర్ గేదెల సుధ అత్యాచారానికి పాల్పడిన ఘటనపై పోక్సో కేసు నమోదు చేయాలని కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర నాయకులు మిస్కా కృష్ణయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒంటరిగా వెళ్తున్న వెళ్తున్న విద్యార్థినిని గ్రామానికి ఆటో వెళ్తుందని నమ్మించి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువెళ్లి ఆత్యాచారానికి పాల్పడుతున్నాడని అన్నారు. ఈ నేపథ్యంలో బాలిక అరుపులు విని ఆటుగా వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ గుర్తించడంతో బాలికను రక్షించారని అన్నారు. తనపై జరిగిన దాడిపై సరుబుజ్జిలి పోలీస్‌లకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయకుండా పోలీసులు తాత్సారం చేయడం సరికాదన్నారు. ఈ ఘటనపై తక్షణమే పోలీసులు స్పందించి బాధ్యునిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

శ్మశానవాటిక పరిశీలన

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- లావేరు



శ్మశానంలో వేసిన వ్యర్థాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారి రాంబాబు

మండల కేంద్రం లావేరు పంచాయతీ పరిధిలోని కేశవరాయపురం గ్రామానికి చెందిన శ్మశానవాటికలో ఇటీవల కొంతమంది ట్రాక్టర్ల వారు మట్టి, రాళ్లు, ఇటుకలతో కూడిన వ్యర్థాలను శ్మశానంలో సుమారు 20 లోడులు వరకు వేసేయడంతో శవ దహనానికి గ్రామస్తులు మంగళవారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో కె.ఎస్ పురం శ్మశానం కబ్జా శీర్షికతో ప్రజాశక్తిలో కథనం వెలువడడంతో జిల్లా రెవెన్యూ, పంచాయతీ అధికారులు స్పందించారు. దీంతో తహశీల్దార్ గురుగుబిల్లి ఈశ్వర శ్రీనువాసరావు ఆదేశాలతో లావేరు, జిజి వలస విఆర్‌ఒలు రమేష్, రాంబాబు బుధవారం శ్మశానంలో వేసిన రాళ్లు, ఇటుకలు, మట్టి పోగులను పరిశీలించారు. అనంతరం విచారణ చేసి వీటిని వేసిన ట్రాక్టర్ వాహనదారులను గుర్తించి వెంటనే అక్కడ వేసిన మట్టి, రాళ్ళు, ఇటుకుల పోగులను అక్కడ నుంచి వెంటనే తరలించాలని ఆదేశించారు. జాప్యం చేస్తే నోటీసులు ఇచ్చి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించడంతో అక్కడ నుంచి తొలగించేస్తామని సంబంధిత బాధ్యలు అంగీకరించడంతో సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టినట్లు అధికారులు తెలిపారు.

చిన్నారుల భవిష్యత్‌కు భద్రత

'ప్రజాశక్తి' కథనానికి స్పందన



డిపాజిట్ పత్రాలు అందిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- కవిటి

అనుకోని ప్రమాదంలో మృత్యువాత పడిన గొండ్యాలపుట్టుగకు చెందిన బైరెడ్ల రమేష్ కుటుంబ దయనీయ స్థితి వివరిస్తూ నవంబరు 14న ప్రజాశక్తి ప్రచురించిన 'మావయ్య.. నాన్నేరి..' కథనానికి దాతలు ఉదారంగా స్పందించారు. రమేష్ కుటుంబ దయనీయ పరిస్థితికి చలించి గ్రామస్తులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు, యువకులు, పూర్వ విద్యార్థులు అందించిన మొత్తంలో రమేష్ ఇద్దరు కుమార్తెల పేరిట చెరో రూ.4 లక్షల చొప్పున మొత్తం రూ.8 లక్షలు బుధవారం ఫిక్స్ డిపాజిట్ చేశారు. దానికి సంబంధించిన పత్రాలు గ్రామస్తుల సమక్షంలో రమేష్ భార్య మోహిని, చిన్నారులకు అందించారు. అదే విధంగా మిగిలిన కొంత మొత్తం, ఇంకా కొంతమంది దాతలు ఇస్తామన్న సొమ్ము కలిపి రమేష్ కొడుకు పేరిట మరో వారంలో డిపాజిట్ చేస్తామని గ్రామస్తులు ప్రజాశక్తితో తెలిపారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ దయనీయ స్థితిలో ఉన్న ముగ్గురు చిన్నారులకు సహాయ సహకార అందించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

ప్రజాశక్తి- పలాస




పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని, నాణ్యత లోపిస్తే సహించేది లేదని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు అంతరకుడ్డలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5 లక్షలతో చేపడుతున్న సిసి, రోడ్డు పనులను కమిషనర్ ఇ.శ్రీనివాసుతో కలిసి బుధవారం పరిశీలించారు. నాణ్యతతో కూడిన పనిని వేగవంతంగా చేపట్టాలని అధికారులకు అదేశించారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

మహిళలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రతిశాఖకూ, కార్యాలయాలకు ఉందని చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో ఉన్న మెప్మా భవనంపై రూ.7 లక్షలతో నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెప్మా కార్యాలయానికి ఎక్కువ మంది మహిళా సంఘాల నాయకులు, కార్యకర్తలు వస్తుంటారని, ఇంత వరకు వారికి టాయిలెట్స్ సౌకర్యం లేక చాలా ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. ఎట్టకేలకు వారి కోరిక మేరకు వారికి ఆ సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అంతరకుడ్డ గ్రామ పెద్దలు రాట్టాడు మాధవరావు, గున్న పద్మలోచన, సనపల నరిసింహమూర్తి, గున్న నర్శింహమూర్తి, మడుమించి జోగారావు, గున్న రవి, వెంకటరమణ, గొనవ చిట్టన్న, మెప్మా కార్యాలయం వద్ద కమిషనర్ శ్రీనివాసులు, డిఇ కనకరాజు, ఎఇలు, మెప్మా సిఎం ఎం.మోహన్, రాము పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో దళారుల రాజ్యం



మాట్లాడుతున్న ఆనందరావు

ప్రజాశక్తి- కొత్తూరు

ధాన్యం కొనుగోలులో దళారుల రాజ్యమేలుతున్నారని వైసిపి మండల అధ్యక్షులు గండివలస ఆనందరావు అన్నారు. కొత్తూరులో బుధవారం విలేకరులతో మాట్లాడారు. రైతు నేరుగా పండించే ధాన్యం అమ్మేందుకు రైస్ మిల్లుకు తీసుకెళ్తే... మిల్లర్లు షాక్‌లు చెబుతూ నిరాకరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అధికారులు పూర్తిగా పట్టించుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకోని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈయన వెంట వైసిపి నాయకులు ఆగతముడి రంజిత్ కుమార్, నాగేశ్వరరావు, గుడ బండి పోలయ్య, బొమ్మాళి నగేష్, దుప్పల వాసు, మన్మథరావు, సర్పంచ్ నాసా బాలకృష్ణ పాల్గొన్నారు.

అక్రమంగా చెట్లు నరికివేత

అనుమతుల్లేకుండా విక్రయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని గాజుల కొల్లివలస గ్రామ పరిధిలో ఉన్న సంగమేశ్వర స్వామి కొండ దిగువ ప్రాంతంలో చెట్లను అక్రమంగా నరికి వేసి అమ్ముకున్న ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఏపుగా పెరిగిన నీలగిరి తదితర మొక్కలను కొందరు వ్యక్తులు జెసిబి సహాయంతో తొలగించి విక్రయించినట్లు సమీప ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే గాజుల కొల్లివలస గ్రామానికి చెందిన ప్రధాన రాజకీయ పార్టీలకు అనుబంధంగా ఉన్న కొందరు నాయకులు ఎటువంటి అధికార అనుమతులు లేకుండా భారీగా పెరిగిన మొక్కలను తొలగించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. చెట్లను నరకవద్దని కొందరు స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ వారి మాటలను లెక్కచేయకుండా దౌర్జన్యంగా వ్యవహరిస్తూ మొక్కలను పూర్తిగా తొలగించారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడచిన కొన్ని సంవత్సరాల క్రితం అటవీశాఖ అధికారులు సంగమేశ్వర స్వామి కొండ దిగువ ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా నీలగిరి తదితర మొక్కలను నాటినట్లు గ్రామస్తులు గుర్తు చేస్తున్నారు. అటువంటి మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగి పర్యావరణానికి వాతావరణానికి ఎంతో ఉపయోగపడుతున్న సమయంలో, అక్రమార్కులు స్వలాభం కోసం ఇష్టారాజ్యంగా వాటిని నరికి తీసుకెళ్లడంలో ఆంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఇదే ప్రాంతంలో గత కొన్నేళ్లుగా కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా వ్యవహరిస్తూ సంగమేశ్వర స్వామి కొండకు పిక్నిక్‌లకు వచ్చే సందర్శకుల వద్ద సుంకాలు కూడా వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. చెట్ల నరికివేతపై ఇప్పటివరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోక పోవడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఒకవైపు ప్రభుత్వం కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం ఒక యజ్ఞంలా చేపడుతుంటే, మరోవైపు ఇలాంటి అక్రమ నరికివేతలు పర్యావరణానికి తీరని నష్టం కలిగిస్తున్నాయని స్థానికులు, పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెట్ల తొలగింపుతో అక్కడి పచ్చదనం నశించి జీవ వైవిధ్యానికి కూడా ముప్పు ఏర్పడుతుందని వారు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అటవీ, రెవెన్యూ, పోలీస్ అధికారులు మొద్దు నిద్ర వీడి, అక్రమంగా చెట్లు నరికి వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సంగమేశ్వర స్వామి కొండ ప్రాంతాన్ని సంరక్షించి వృక్ష సంపదను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికే కాకుండా సమాజానికీ ఉందని ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



నరికిన నీలగిరి చెట్ల దుంగలు

బస్సు ఢీకొని వృద్ధుడు మృతి

సరుబుజ్జిలి: మండలంలోని అవతారబాద్ గ్రామానికి చెందిన సురవరపు రామినాయుడు (77) అనే వృద్ధుడు బుధవారం బస్సు ఢీకొని మృతి చెందినట్లు ఎస్ఐ బి.హైమావతి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు మృతుడు రామినాయుడు ఉదయం స్వగ్రామమైన అవతారాబాద్ నుంచి రొట్టవలస వెళ్లి తిరిగి నడుకుని వస్తున్న సమయంలో శ్రీకాకుళం నుంచి బత్తిలి వెళ్తున్న ఆర్‌టిసి అద్దె బస్సు వెనుక నుంచి వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఆమె తెలిపారు. మృతుడు రామినాయుడు కుమారుడు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.



విద్యార్థికి సన్మానం చేస్తున్న పాఠశాల యాజమాన్యం

మెరిట్ విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మెహర్ విద్యావిహార్ పాఠశాలలో మెరిట్ విద్యార్థులకు బుధవారం సత్కరించారు. షీల్డ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఎం.హరిమెహర్, వై.విజయసారధి హాజరయ్యారు. గతేడాది క్లాస్ టాఫర్‌కు షీల్డు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



షర్మిల జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా షర్మిల జన్మదిన వేడుకలు

ఆమదాలవలస: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలు పట్టణంలో ఘనంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముందుగా కాంగ్రెస్ నాయకుల సమక్షంలో కేక్ కట్ చేశారు. అనంతరం పట్టణంలోని ప్రజలు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఆనందోత్సాహాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అన్నాజీరావు మాట్లాడుతూ వైఎస్ కుటుంబానికి ప్రజలతో ఉన్న అనుబంధం చిరకాలమైందని, వైఎస్ రాజశేఖర రెడ్డి సంక్షేమ పాలన ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిందని గుర్తు చేశారు. అదే మార్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతున్న వైఎస్ షర్మిల నాయకత్వం కాంగ్రెస్ పార్టీకి కొత్త దిశను చూపుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కార్యకర్తలందరూ ఐక్యతతో పని చేయాలని, ప్రజా సమస్యలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు లఖినేని నారాయణ రావు, సువ్వారి రమ ణ, దాలయ్య, పప్పల అప్పారావు, రమేష్ పాల్గొన్నారు.

'అరసవల్లి'లో ఆన్‌లైన్ బుకింగ్ సౌకర్యం

అరసవల్లి: సూర్యనారాయణ స్వామి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అంతరాలయ దర్శనం, సూర్యనమస్కారములు, వివిధ సేవలు, ప్రసాదాల బుకింగ్‌ను మరింత సులభతరం చేస్తూ ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకు రావడం జరిగిందని ఆలయ ఇఒ కె. ఎన్.వి.డి.వి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్ ద్వారా భక్తులు తమ సేవా టికెట్లను, ప్రసాదాలను www.aptemples.ap.gov.in అధికారిక వెబ్‌సైట్ ద్వారా ముందుగానే బుక్ చేసుకోవచ్చునన్నారు. స్వయంగా ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోలేని భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలోనే ప్రత్యేక ఆన్‌లైన్ బుకింగ్ కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సమయం ఆదా చేసుకునేందుకు, ఎటువంటి ఇబ్బందులు లేకుండా దర్శనం పొందేందుకు ఈ ఆన్‌లైన్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న యువకులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని దూగానపుట్టుగకు చెందిన పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ విప్ ఎం యువకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాడుపూడి-బొరివంక తారు రోడ్డుపై కిలోమీటరు పైగా కొత్త రోడ్డు పనులు చేపట్టడంతో పాటు జంగిల్ క్లియరెన్స్ చేయాలంటూ విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన అశోక్ రెండు రోజుల్లో జంగిల్ క్లియరెన్స్, నెల రోజుల్లో రోడ్డు పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రోగ్రాం కమిటీ కో-ఆర్డినేటర్ దూగాన దివాకర్, మనోజ్, సిసింద్రి, వైకుంఠరావు, హేమచలపతి, భాస్కర్, సతీష్, నవీన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యాభివృద్ధిలో క్రీడల పాత్ర

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

విద్యాభివృద్ధిలో క్రీడల పాత్ర అమోఘమని గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.హరిబాబు అన్నారు. పాఠశాల ఆవరణలో ఇటీవల నగరంపల్లి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి పాఠశాల క్రీడల ఆటల పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులను బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధిలో క్రీడల పాత్ర విడదీయరానిదని అన్నారు. క్రీడల ద్వారా ప్రభుత్వ కొలువులు కూడా సాధిస్తున్నారని తెలిపారు. మనం జీవితంలో వెనుక పడకుండా ఉండడానికి క్రీడలు ఒక సాధనంగా ఉపయోగపడతాయని, అందరూ దీనిలో పాల్గొని సామర్థ్యమైన నైపుణ్యం సాధించాలని కోరారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ రమేష్‌బాబు

పెండింగ్ చలానాలు చెల్లించాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ద్విచక్ర వాహనదారులు పెండింగ్ చలానాలను చెల్లించాలని ఎస్ఐ పి.రమేష్‌బాబు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులందరూ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపినందుకు విధించిన ఈ-చలానాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నట్లయితే, వాటిని అలస్యం చేయకుండా చెల్లించాలని అన్నారు. ప్రజలు తమ ఫోన్‌లో యాప్‌లో 'సెర్చ్' 'ఈ చలాన్ / ఏపి ఈ చాలాన్' అని సెర్చ్ చేసి వాహనాల నంబరు నమోదు చేసి సులభంగా ఆన్‌లైన్ ద్వారా చలానా మొత్తాన్ని చెల్లించవచ్చని పోలీసులు తెలిపారు. చలానాలు చెల్లించకపోతే భవిష్యత్తులో చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. వాహనదారులందరూ బాధ్యతగా వ్యవహరించి వెంటనే చలానాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న సభ్యులు

రైలు ప్రయాణికుల అవసరాలు గుర్తించాలి

ఇచ్ఛాపురం: రైలు ప్రయాణికుల అవసరాలను గుర్తించాలని రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ సభ్యులు కోరారు. ఈ మేరకు ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ చైర్మన్, స్టేషన్ మేనేజర్ అజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం స్టేషన్ కన్సల్టేటివ్ సమావేశం నిర్వహించారు. ప్రధానంగా కొత్త ఫుట్ ఓవర్ బ్రిడ్జి లిఫ్ట్ సౌకర్యంతో రైల్వేస్టేషన్ పశ్చిమ వైపు వరకు పొడిగించడం అవసరమని అన్నారు. ప్రస్తుతం కొత్త ఫుట్ ఓవర్ బ్రిడ్జి ప్లాట్‌ఫారం-1, ప్లాట్‌ఫారం-2 మధ్య నిర్మాణంలో ఉందని పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ పశ్చిమ వైపు నుంచి టిక్కెట్ కౌంటర్, వెయిటింగ్ హాల్ సౌకర్యంతో రైలు ప్రయాణికులకు ప్రవేశ సౌకర్యం కల్పించాలన్నారు. పార్కింగ్ స్టాండ్ వద్ద షెల్టర్ సౌకర్యం కల్పించి, అధిక ఛార్జీల వసూలును నియంత్రించాలన్నారు. కొలిగాం-ఇచ్ఛాపురం రోడ్డులోని ఎల్‌సి గేట్ 329 వద్ద ఆర్‌ఒబి నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు తిరుమలరావు, దేవరపల్లి గోపాలరావు, ఉప్పాడ శంకర్‌రెడ్డి, వి.కె.ప్రసాద్, డిఆర్‌యుసిసి సభ్యులు కట్ట సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

త్రో బాల్ మహిళా విజేత మెళియాపుట్టి

టెక్కలి: టెక్కలి ఉపవిద్యాశాఖాధికారి కార్యాలయ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉపాధ్యాయులకు త్రో బాల్ పోటీలను బుధవారం నిర్వహించారు. స్థానిక మహాత్మాజ్యోతీరావు పూలే పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ పోటీలకు డివిజన్‌లో 9 మండలాలకు చెందిన పలు పాఠశాలల్లోని మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వీరిలో మెళియాపుట్టి మండలానికి చెందిన మహిళా ఉపాధ్యాయులు ప్రథమ స్థానంలో విజేతలుగా నిలిచారు. ద్వితీయ స్థానంలో పాతపట్నం, తృతీయస్థానంలో టెక్కలి మండలాలకు చెందిన మహిళా ఉపాధ్యాయుల జట్టు ఎంపికైంది. జిల్లాస్థాయిలో నిర్వహించనున్న స్కూల్‌గేమ్స్ పోటీల్లో వీరు పాల్గొనున్నారని జోనల్ ఇన్‌ఛార్జ్ బాదాన నారాయణరావు తెలిపారు. ఈ పోటీలను పాఠశాల ప్రిన్సిపల్ పి.సుధారాణి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు, సవర దేవేంద్రరావు, మల్లారెడ్డి పద్మనాభం, ఎంఎస్‌లు కృష్ణారావు, తిరుపతిరావు, వాసుదేవరావు, కె.కె.రామిరెడ్డి, ఆదిశేషు, జగదీష్, హేమలత, గోవిందరావు పాల్గొన్నారు.

అదనపు బస్సు సౌకర్యంపై హర్షం

కంచిలి: మండలంలోని పెద్దశ్రీరాంపురం, పలసర ఉద్దాన ప్రాంత విద్యార్థులకు సౌకర్యంగా ఉండేందుకు సోంపేట నుంచి అదనపు ఆర్‌టిసి బస్సు సర్వీసు కల్పించాలని విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ఇటీవల కోరారు. ఈ నేపథ్యంలో బస్ సర్వీసును అధికారులు కల్పించారు. బస్సు సర్వీసు కల్పించేందుకు కృషి చేసిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌లకు టిడిపి మండల అధ్యక్షులు మాదిన రామారావు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థులకు అందుబాటులో ఉండేలా సాయంత్రం బస్సు వేళలు కల్పించాలి కోరిన వెంటనే చర్యలు తీసుకుని సహకరించిన పలాస ఆర్‌టిసి డిపో మేనేజర్ శ్యామ్ సుందర్‌కు బుధవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. మండల శివార్లలోని ఎమ్మెస్ పల్లి, కొల్లూరు, కొసక, సువాగడ గ్రామాలకు సైతం బస్సు సేవలు కల్పించాలని కోరారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

గ్రామీణ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలంటే నైపుణ్యాభివృద్ధి, వ్యాపార దృక్పథం అవసరమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన మిల్లెట్ విలువ జోడింపు శిక్షణ కార్యక్రమం ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఎ) జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో మైక్రో ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద 15 రోజుల పాటు ఈ శిక్షణను నిర్వహించారు. ఆమదాలవలస, సరుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట, హిరమండలం, బూర్జ మండలాలకు చెందిన 30 స్వయం సహాయక సంఘాల మహిళలు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఈ శిక్షణ సమయంలో మిల్లెట్ ఆధారిత బిస్కెట్లు, స్నాక్స్, కేకులు, మిల్లెట్ పౌడర్లు వంటి పోషక విలువలు కలిగిన ఉత్పత్తుల తయారీలో ప్రాయోగిక నైపుణ్యాలు అందించారు. అలాగే ప్యాకింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్, వ్యాపారాభివృద్ధి అంశాలపై అవగాహన కల్పించి స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకునేలా శిక్షణను ఇచ్చారు. ఈ సందర్భంగా



మహిళలకు ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలను ఉపయోగించి స్థిరమైన వ్యాపారాలు ప్రారంభించి కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. మహిళలు తయారు చేసే ఉత్పత్తుల విక్రయానికి మున్సిపాలిటీ పరిధిలో రెండు దుకాణాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, నాబార్డు మేనేజర్ రమేష్ కృష్ణ, లీడ్ డిస్ట్రిక్ట్ బ్యాంకు మేనేజర్ పి.శ్రీనివాస్, కెవికె ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. కె.భాగ్యలక్ష్మి, డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాకరేపుతున్న పోరంబోకు భూములు

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వ పోరంబోకు భూముల్లో వివాదాలకు కేంద్రంగా మారింది. రూ. కోట్లు విలువ చేసే భూములు కావడంతో ఒకరు నుంచి ఒకరు చేతులు మారి ప్రస్తుత కోర్టు చుట్టూ తిరుగుతూ ఆ భూముల్లో తగాదాలు పడుతున్నారు. గతంలో అప్పటి టిడిపి ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ పెట్రోల్ బంక్ ఏర్పాటుకు జిల్లా రెవెన్యూ అధికారులు శంకుస్థాపన కూడా చేశారు. ప్రస్తుతం ఆ భూముల్లో తమది అంటూ తమదని వ్యాపారులు తగాదాలు పడుతున్నారు. రెవెన్యూ అధికారులు తమకేమి సంబంధం లేదని చేతులు ఎత్తివేయడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

మండలంలోని కోసంగిపురం కూడలి బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 67లో ఉన్న ప్రభుత్వ పోరంబోకు భూమి వివాదాలకు కేంద్రబిందువుగా మారుతోంది. 198 ఎకరాల భూమిలో 150 ఎకరాలు రాష్ట్ర ప్రభుత్వం సుడాకు అప్పగించి ప్రభుత్వ లేఅవుట్‌గా అభివృద్ధి చేస్తుంది. మిగిలిన భూమి అసెండ్గా మారి



తగాదాలు పడుతున్న వ్యాపారులు (ఫైల్)

కొంతమందికి పట్టాలు ఇచ్చినట్లు రికార్డులు ఉన్నాయి. ఎక్కడైనా ప్రభుత్వ భూమి చేతులు మారాలంటే ప్రత్యేకంగా కమిటీ వేసి వాటిని అందించాల్సి ఉంది. కానీ, ఇక్కడ మాత్రం కొనుగోలు పత్రాలతో ఐదెకరాల భూమి ఐదుగురు వ్యక్తుల చేతులు మారి చివరకు మిలట్రీపోరంబోకు భూమిగా రూపాంతరం చెందింది. చివరకు ఆ భూమి కూడా నిరభ్యంతర పత్రాలు తెచ్చుకొని పబ్లిక్‌గా అమ్మకానికి పెట్టుకోవడం తీవ్ర సంచలనంగా మారింది.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని రాగోలు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ పి.ఉదయ్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని బంటుపల్లి, కమ్మసిగడంలో ప్రభుత్వం, వ్యవసాయశాఖ నిర్వహిస్తున్న పొలం పిలిస్తుంది కార్యక్రమం, ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా, జిల్లా వనరుల కేంద్రం వారు రబీ 2025- 26 సీజన్‌లో వేసిన మొక్కజొన్న, అపరాల పంటల పరిస్థితుల పరిశీలనకు క్షేత్రస్థాయి సందర్శన చేశారు. ఈ క్షేత్ర సందర్శనలో మొక్కజొన్న, అపరాల పంటలో చేపట్టాల్సిన ఎరువుల యాజమాన్యం, పురుగు తెగులు యాజమాన్యంపై రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు సిహెచ్ వెంకటరావు, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వై.సురేష్, రణస్థలం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు వి.శ్రీనివాస్, మండలం వ్యవసాయ అధికారి డి.విజయ్ భాస్కర్, ఎఇఒలు సునీత, వై.రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

పొందూరు: రైతులు మొక్కజొన్న, అపరాల సాగులో



రణస్థలం రూరల్ : పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

యాజమాన్య పద్ధతులను పాటించాలని రాగోలు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డా.పి.ఉదయ్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని లోలుగు, కృష్ణాపురం, జి.సిగడాం మండలంలోని సంతవురిటి గ్రామాల్లో ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో క్షేత్ర సందర్శన చేశారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు సిహెచ్.వెంకటరావు, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వై.సురేష్, ఎఇఒ పి.ప్రవీణ్‌కుమార్, లీలామోహన్, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని రాజపురం సబ్‌స్టేషన్ పరిధిలోని 11కెవి భైరిపురం ఫీడర్ లో ఆర్‌డిఎస్‌ఎస్ పనులు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. నెలవంక, సీమూరు, వడ్డీపుట్టుగ, బైరెడ్లపుట్టుగ, మజ్జిపుట్టుగ, కొమ్ముపుట్టుగ గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగ దారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

పలాస : పలాస విద్యుత్ శాఖ నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పలాస విద్యుత్ శాఖ ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పలాస మండలంలో కాశీబుగ్గ టౌన్, పాత జాతీయ రహదారి, అన్నపూర్ణ ఆశ్రమం, పలాస టౌన్, కెటి రోడ్డు నుంచి మోగిలిపాడు వరకు, హరిశంకర్ థియేటర్ నుంచి రెంటికోట వరకు, ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి లక్ష్మీపురం టోల్ గేట్ వరకు, గాంధీనగర్, హరిజన వీధి, బ్రాహ్మణ వీధి,

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఇండస్ట్రియల్ ఏరియా, అనంతపురం, శ్రీనివాసనగర్, ఎంపిడిఒ కార్యాలయ పరిసరాలు, సూదికొండ, రోటరీ నగర్, నెమలి, నెమలినారాయణపురం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందన్నారు.

పోలాకి : విద్యుత్ వినియోగదారులకు శుక్రవారం మండలంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎఇఇ నరసింహ కుమార్ ప్రకటనలో తెలిపారు. పిన్నింటిపేట, పిన్నింటి పేట ఎస్‌ఎస్, ఆక్వా సర్వీసులు రైతులు, కోడూరు, మగత పాడు, గుప్పెడుపేట, చిన్న కోవూరిపేట, గొల్లవాని పేట, జోగంపేట, కొత్తరేవు, కోవిరి పేట, అక్కువరం, కంబాల వానిపేట, పరపతివాని పేట, డి.ఎల్.పురం, సత్రావు పేట, బెలమర పాలవలస, పిరియా, సుసరం, గాథలవలస, బార్జిపాడు, రేగుపాడు, రెహమాన్‌పురం, బొద్దాం, వనవిష్ణుపురం, ప్రకాశరావుపేట, చిన్నకోడూరు, ఆక్వా బెల్ట్ పోలాకి ప్రాంతాలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

తోలాపిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

పొందూరు: మండలంలోని తోలాపిలో శ్రీ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం శ్రీకాకుళం శంకర ఐ ఫౌండేషన్ ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సుమారు 105 మందికి వివిధ రకాల నేత్ర పరీక్షలను నిర్వహించగా, ఇందులో కంటి ఆపరేషన్లుకు 30 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీ శంకర ఐ ఫౌండేషన్ వైద్యులు, సిబ్బంది, సత్యసాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పురపాలక సంఘం పరిధిలోని 22 వార్డులోని వాసుదేవపేటలో 15వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ పనులను కమిషనర్ ఎన్.రమేష్ బుధవారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ పరిశీలనలో 22వ వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్, అసిస్టెంట్ ఇంజినీర్ వీరకిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్రకుమార్ పాల్గొన్నారు.

బాల కార్మికులను పనిలో పెట్టవద్దు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని టెక్కలి కార్మికశాఖ అధికారి రాధకుమారి హెచ్చరించారు. టెక్కలిలోని పలు షాపింగ్ మాల్స్, దుకాణాలు తదితర వాటిని చైల్డ్‌లైన్, సమగ్ర శిక్ష, ఎన్‌జిఒలు, పోలీసులతో కలిసి బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. 14 ఏళ్లు నిండకుండా పనిలో పెట్టుకుంటే బాలకార్మికుల పరిధిలోకి వస్తారని, అలా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎపిఎస్‌టిఎ జిల్లా ఉపాధ్యక్షునిగా చక్రపాణి

పలాస: స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఎపిఎస్‌టిఎ) జిల్లా ఉపాధ్యక్షునిగా చక్రపాణి ప్రధాన్ నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సప్పటి మల్లేసు, పంచాది గోవిందరాజులు ఒక ప్రకటనల తెలిపారు. పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒరియా స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈయన నియామకంపై ఆ సంఘం నాయకులు తమ్మినాన చందన రావు, నెమలిపురి విష్ణుమూర్తి, మజ్జి చిన్నబాబు, మెట్ట గోపాల కృష్ణ, నాగవంశపు సురేష్ హర్షం ప్రకటించారు.

ఉద్యాన పంటలు లాభదాయకం

నందిగాం : మెట్టు ప్రాంత రైతులు ఉద్యాన పంటలను సాగు చేస్తే అధిక, ఆదాయం పొందవచ్చునని ఉద్యానవన శాఖాధికారి ప్రియాంక అన్నారు. మండలంలోని బెజ్జపల్లిలో పండిస్తున్న పూలు, కూరగాయల సాగులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రైతూ ఉద్యాన పంట వైపు అడుగు వేస్తే దిగుబడి పెరగడంతో పాటు మార్కెట్‌లో డిమాండ్ ఉండే పంటలను సాగు చేయవచ్చునని సూచించారు. కార్యక్రమంలో ఎఒ పి.శ్రీకాంత్‌వర్మ టిడిపి టి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న వాకర్స్ ప్రతినిధులు

బాక్సింగ్ క్రీడాకారులకు అభినందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం

బాక్సింగ్ క్రీడకు పుట్టినిల్లు శ్రీకాకుళం జిల్లా అని, గడిచిన మూడు దశాబ్దాలుగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సిక్కోలు జిల్లా బాక్సింగ్‌లో ప్రథమస్థానం సంపాదిస్తూ వస్తుందని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, శాసపు జోగినాయుడు అన్నారు. రాష్ట్రస్థాయి మెన్ బాక్సింగ్ పోటీలు ఈ నెల 13, 14 తేదీల్లో విజయవాడలో జరిగాయి. ఈ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా రన్నర్స్ చాంపియన్ దక్కించు కున్నారు. ఈ సందర్భంగా విజేతలకు బుధవారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. వీరితో పాటు కోచ్‌లు ఎం.ఉమా మహేశ్వరరావు, రాజీవ్‌లను వాకర్స్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, మెట్ట దనుంజయ.భట్ల, గోలీ ఉమా మహేశ్వర రావు, గేదెల లక్ష్మీ, నాగేశ్వర ఈశ్వరరావులు దుస్సాలువలతో సత్కరించారు. రాష్ట్రస్థాయి మెన్ బాక్సింగ్ పోటీల్లో నగరానికి చెందిన పి.విశ్వేశ్వరరావు గోల్డ్‌మెడల్ సంపాదించుకున్నారు. పి. ప్రసాద్ సిల్వర్, జి.జ్ఞానేశ్వరరావు సిల్వర్, కె.హరీష్ కుమార్ సిల్వర్, ఎస్.యేసు సిల్వర్, బి. మనోజ్ కుమార్ బ్రాంజ్ మెడల్ దక్కించుకున్నారు.

సిసి రోడ్ల నిర్మాణానికి పరిశీలన

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం మండల కేంద్రం జె.ఆర్.పురం పంచాయతీ గరికిపాలెం, 6వవార్డు వెంకటేశ్వర కాలనీలో సిసి రోడ్లు, కాలువలను నూతనంగా నిర్మించేందుకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు నాణ్యతగా చేయాలని కోరారు. అపార్ట్మెంట్స్ యొక్క చెత్త కొరకు అపార్ట్మెంట్స్ వారు ఖచ్చితంగా డస్ట్ బిన్ వాడేలా అపార్ట్మెంట్ వారికి తెలియపరచాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా ప్రజలు సహకరించాలని, ప్రజలకు హాని కరంగా చెత్త వేసే వ్యక్తులకు నోటీసులు జారీ చేయాలని కార్యదర్శికి ఆదేశించారు. ఆయనతో జె.ఆర్.పురం కార్యదర్శి చంద్ర శేఖర్, శానిటేషన్ మేస్త్రి పాణి కుమార్ పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ మిషన్ ట్రాక్టర్లు పంపిణీ



పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛభారత్ మిషన్ ట్రాక్టర్లు పంపిణీ కార్యక్రమాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు బుధవారం ప్రారంభించి మాట్లాడుతూ స్వచ్ఛభారత్ అనేది ప్రతి పౌరుడి బాధ్యతని, పారిశుధ్యం, బహిరంగ మలవిసర్జనను నిర్మూలించడం, వీధులను శుభ్రపరచడం, పరిశుభ్రమైన వాతావరణానికి ప్రజలు తమ వంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు, అధికారులు, కార్యదర్శులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎంఇఒలు

సైన్స్ ప్రాజెక్టులతో మేధాశక్తి వృద్ధి

ప్రజాశక్తి- పలాస

విద్యార్థులు చదువుతో పాటు సైన్స్ ప్రాజెక్టులు తయారు చేయడం ద్వారా మేధాశక్తి వృద్ధి చెందుతుందని ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మొగిలిపాడు ఉన్నత పాఠశాలలో బుధవారం 13 పాఠశాలల విద్యార్థులకు సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ సైన్స్ ప్రాజెక్టులు విద్యార్థుల ప్రతిభ చాటుకొనేందుకు గొప్ప అవకాశం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు కేవలం చదవే కాకుండా సైన్స్ ప్రాజెక్టులు తయారు చేయడంలో విద్యార్థులకు మెలుకువలు నేర్పించాలన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.కృష్ణారావు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌లో ఎంఇఒలు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథం, ప్రభుత్వ జూనియర్ బాలురు కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.శరత్‌బాబు, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎ.జయలక్ష్మి ప్రారంభించారు. మొత్తం 16 పాఠశాలలు పాల్గొన్నాయి. 50 ప్రాజెక్టులు ప్రదర్శించారు. సామూహిక విద్యార్థి కేటగిరిలో జెడ్‌పి కొలిగాం, ఎపి మోడల్ స్కూల్ పురుషోత్తపురం, వ్యక్తిగత విద్యార్థి విభాగంలో పురుషోత్తపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉపాధ్యాయ విభాగంలో జెడ్‌పి కొలిగాం ఎన్నికయ్యాయి. వీరు జిల్లాస్థాయిలో ఈ నెల 19న శ్రీకాకుళంలో నిర్వహించనున్న ఎగ్జిబిషన్ పాల్గొంటారని ఎంఇఒ తెలిపారు.



ఆర్థికసాయం చేస్తున్న హెల్పింగ్ హాండ్స్ సభ్యులు

రూ.10 వేలు ఆర్థికసాయం

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం హెల్పింగ్ హాండ్స్ స్వేచ్ఛంద సేవాసంస్థ సభ్యులు రణస్థలం గ్రామానికి చెందిన లావేటి నవీన్ కుమార్‌కు బుధవారం రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో నవీన్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నారు. అత్యవసర, ఆర్థిక స్థితిని దృష్టిలో ఉంచుకుని రణస్థలం హెల్పింగ్ హాండ్స్ సభ్యులు రిమ్స్ ఆస్పత్రికి వెళ్లి నవీన్‌కుమార్ కుటుంబసభ్యులకు రూ.10 వేలు అందజేశారు. హెల్పింగ్ హాండ్స్ సభ్యులు ఆర్థికసాయం అందజేయటతో సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



ఎంపికైన ప్రాజెక్టు విద్యార్థులతో ఎంఇఒలు వాగ్దేవి, రాజారావు

ఐదు సైన్స్ ప్రాజెక్టులు ఎంపిక

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఇఒ-1, 2 ఎం.వాగ్దేవి, పి.రాజారావుల అధ్యక్షతన బుధవారం మండలస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 10 పాఠశాలలకు చెందిన 26 ప్రాజెక్టులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. ఈ ప్రదర్శనలో ఉత్తమంగా ఉన్న ఐదు ప్రాజెక్టులను జ్యూరీ కమిటీ ఎంపిక చేశారు. ఇందులో విజేతలుగా పొందూరు జిహెచ్ఎస్ ప్రాజెక్టు పేషెంట్ స్మార్ట్‌హెల్త్ మానిటరింగ్ సిస్టం, లోలుగు జెడ్‌పిహెచ్ఎస్‌కు చెందిన వేస్టు టు ఎనర్జీ, తోలాపి జెడ్‌పిహెచ్ఎస్‌కు చెందిన ప్రమాదపు అంచుల్లో భూగోళం, పొందూరు కెజిబివికి చెందిన లైఫ్ సేవర్ స్టిక్, వాయిస్ బేస్డ్ పోర్టబుల్ మెడిటేషన్ ప్రాజెక్టులు నిలిచాయి. ఈనెల 19న జిల్లాస్థాయిలో జరిగే సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఈ ప్రాజెక్టులను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

కోటబొమ్మాళి: టిడిపి, కళింగ వైశ్య కుల అభివృద్ధికి కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు చేసిన సేవలు గుర్తింపునిచ్చాయనికొత్తపేటకు చెందిన సాయికోమలి మెడికల్, ఆస్పత్రి నిర్వాహకులు పట్నాన షణ్ముఖరావు అన్నారు. బోయిన గోవిందరాజులు విజయవాడలో ప్రమాణస్వీకరం చేసి గ్రామానికి చేరుకున్న సందర్భంగా బుధవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు ఈయనకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షునిగా నియమించి గౌరవం ఇచ్చిందని అన్నారు. అలాగే 2019-24వరకు టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా, కోళింగ కోమటి సాధికార రాష్ట్ర కన్వీనర్‌గా ఆయన సేవలు అందించారు, బిజి జాబితాలోని కళింగ కోమట్లను ఒబిసిలో చేర్చేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై ప్రస్తుత కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ఆధ్వర్యాన ఒబిసి కోసం పాటుపడుతున్నారని అన్నారు.

బీమా రంగంలో ఎఫ్‌డిఐ పెంపు తగదు

పలాస: బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని వంద శాతానికి పెంచడం, బీమా చట్టాల సవరణ బిల్లుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకస్తున్నట్టు ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ పలాస బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారావు, మధన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ప్రస్తుత బీమా రంగంలో ఉపయోగిస్తున్న మొత్తం మూలధనంలో విదేశీపెట్టుబడుల వాటా సుమారు 32 శాతమేనన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎఫ్‌డిఎ పరిమితిని వంద శాతానికి పెంచడం, విదేశీ మూలధనానికి పూర్తిస్థాయి స్వేచ్ఛ ఇవ్వడం అవివేక మైన చర్యగా పేర్కొన్నారు. ఈ నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థ కు మాత్రమే కాకుండా, దేశీయ బీమా సంస్థలకు కూడా తీవ్రమైన దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి- పలాస

విద్యా శాఖ ఆధ్వర్యాన పలాస రైల్వే క్రీడా మైదానంలో బుధవారం డివిజన్ స్థాయిలో ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు సిహెచ్.సత్యం (పలాస), చిన్నారావు (నందిగాం), ఎస్.రామకృష్ణ (కవిటి), ఎం.లక్ష్మణరావు (మందస), వివిధ మండలాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా పి.తవిటయ్య, తోటారావు, సిహెచ్.పద్మలోచనం, ఎస్.రామారావు, ఎస్.చంద్రశేఖర్, పి.గజేంద్ర, రవికాంత్, ఆర్.శ్రీనివాసరావు, గణేష్, ప్రకాశ్ తదితరులు వ్యవహరించారు. తొలిరోజు పోటీలో ఇచ్ఛాపురం మండలంపై నందిగాం, పలాస మండలంపై సోంపేట, కవిటిపై మందస జట్లు విజయాలు నమోదు చేసుకున్నాయి.



క్రికెట్ ఆడుతున్న ఉపాధ్యాయులు

టెక్కలి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న పురుష ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో డివిజన్ ఉపవిద్యాశాధికారి పి.విలియమ్స్, ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు, సవర దేవేంద్రరావు, మల్లారెడ్డి పద్మనాభం, వ్యాయామ ఉపాధ్యాయులు కె.కె.రామిరెడ్డి, కాపల రఘునాథరావు, జి.రామరాజు, సిహెచ్.వాసు, ఎం.రమేష్, గోవిందరావు పాల్గొన్నారు.

వసతిగృహంలో మరమ్మతులు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని రాపాక పంచాయితీలోని వావిలపల్లిపేట వద్ద ఎపి మోడల్ స్కూల్ వసతిగృహంలో మరమ్మతుల పనులకు బుధవారం కూటమి నాయకులు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వశిక్ష అభియాన్ రూ.15లక్షల నిధులతో వసతి గృహంలో మరమ్మతులు చేయనున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, జిల్లా తెలుగుయువత ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు కండాపు శ్రీనివాసరావు, జిల్లా జనసేన సంయుక్త కార్యదర్శి కొంచాడ చిన్నంనాయుడు, ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకరరావు, పిఎంసి చైర్మన్ వి.అరుణకుమారి, కూటిమి నాయకులు వాసు, పారంనాయుడు, సురేష్, గొల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



మరమ్మతుల పనులకు శంకుస్థాపన చేస్తున్న కూటమి నాయకులు